www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 31 మార్చి 2024

5

తూర్పుగోదావరి

ఆస్తి పన్ను చెల్లింపులకు నేడు ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆస్తి పన్ను చెల్లింపులకు ఆదివారం ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయని మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గడువు ఆదివారంతో ముగియనుంది. ఏప్రిల్ ఒకటి నుంచి చెల్లించేవారు మొత్తం వడ్డీతో చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఏడు సచివాలయాలలో చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వి.ఎల్.పురంలోని సచివాలయం నెం.23, ప్రకాష్ నగర్ మీ సేవలోని సచివాలయం నెం.14, సీతంపేట మీసేవలోని సచివాలయం నెం.81, కోటిపల్లి బస్టాండు మీసేవలోని సచివాలయం నెం.36, నారాయణపురంలో సచివాలయం నెం.3, బొగ్గులదిబ్బలో సచివాలయం నెం.42, హౌసింగు బోర్డులోని పంచాయితీ ఆఫీసులో చెల్లించాలని తెలిపారు.

ప్రచారానికి పవన్ కళ్యాణ్ శ్రీకారం

- 4 రోజులపాటు పిఠాపురంలోనే బస
- మాజీ ఎంఎల్ఎ వర్మతో ప్రత్యేక భేటీ
- స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

పిఠాపురం నుంచి విజయ భేరి ఎన్నికల శంఖారావానికి శనివారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ రెండో తేదీ వరకూ ఆయన పిఠాపురం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గొల్లప్రోలు చేరుకున్న పవన్ కళ్యాణ్ తొలుత మాజీ ఎంఎల్ఎ, పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్ఎన్.వర్మ నివాసానికి నేరుగా వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. గొల్లప్రోలులో హెలికాప్టర్ దిగిన పవన్ కళ్యాణ్‌కు పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకుని ఘన స్వాగతం పలికారు. హెలిపాడ్ వద్ద కాకినాడ జనసేన పార్లమెంట్ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ, పెద్దాపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ తుమ్మల బాబు తదితరులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పిఠాపురం మండలంలోని దొంతమూరుకు రోడ్ షోలో పవన్ కళ్యాణ్ వెళ్లారు. దొంతమూరులో మాజీ ఎంఎల్ఎ వర్మ నివాసానికి చేరుకోగానే టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆత్మీయంగా వర్మను పలకరించి పూల బొకే ఇచ్చి అభినందించారు. టిడిపి జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జ్ సుజయ కృష్ణ రంగారావు, వర్మతో కలిసి పవన్ కళ్యాణ్ గంటకుపైగా ఎన్నికల అంశాలు వ్యూహాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడికి భారీ సంఖ్యలో చేరుకున్న వర్మ అభిమానులకు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మీ అందరి ఆదరాభిమానాలు చూరగొన్న వర్మ తన కోసం అసెంబ్లీ సీటును త్యాగం చేశారని, ఆ త్యాగాన్ని తాను ఎప్పుడు మర్చిపోలేనని, వర్మకు కూడా తాను అదే స్థాయిలో ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

అనంతరం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. పొత్తు ధర్మం ప్రకారం తనను గెలిపించే బాధ్యత తీసుకున్న వర్మకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సరైన వైద్యం అందించడం కోసం మూడు మండలాల్లో మల్టీ స్పెషాలిటీ సేవలు అందేలా కషి చేస్తానన్నారు. ఇక్కడి రైతులు, నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు తనకు తెలుసని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యు.కొత్తపల్లి సెజ్‌లో ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎంతమందికి ఉపాధి వచ్చిందో ఒక్కసారి ఆలోచించండన్నారు. గొల్లప్రోలులో ముంపు, చేబ్రోలులో పట్టు రైతులకు ఏమి చేశారని వైసిపి నేతలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలో ఉప్పాడ తీరం కోతకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పట్టు రైతులు, మిర్చి రైతులు నష్టపోతున్నారన్నారు. తనను ఓడించడానికి చిత్తూరు జిల్లా నుంచి మిథున్ రెడ్డి, మండలానికి ఒక కీలక నేతను పెట్టారన్నారు. తన దగ్గర అంతగా శక్తి లేకపోయినా ఎందుకంత కక్ష పెట్టుకున్నారని ప్రశ్నించారు. సుద్దగడ్డ ఆధునీకరణ లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రూ.175 కోట్లు నిధులు వచ్చినా ఎందుకు పనులు చేపట్టలేదని ప్రశ్నించారు. గడచిన ఐదేళ్లలో ఈ సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. తీర ప్రాంతం కోతకు గురవుతున్నా సరైన ప్రణాళికలు చేయలేకపోయారని విమర్శించారు. కోనసాపపేటలో రసాయన పరిశ్రమలు వల్ల మత్స్యకారులకు ఉపాధి పోతున్నా అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదన్నారు.

స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకుంటానన్నారు కాకినాడ పోర్టులో డీజిల్, డ్రగ్స్ మాఫియా నడుస్తోందన్నారు. అక్రమ బియ్యం వ్యాపారం జరుగుతూ పోర్టు అడ్డాగా మారిందని తీవ్ర విరుచుకుపడ్డారు. మాఫియా డాన్ అంటూ పరోక్షంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడిపై విమర్శలు గుప్పించారు. మత్స్యకారులను అవమానించేలా మాట్లాడుతున్నారని అటువంటి వ్యక్తిని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

తనను గెలిపిస్తే పిఠాపురం నియోజవర్గానికి రుణపడి ఉంటానని, ఇక్కడే ఇల్లు తీసుకుని నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటానని తెలిపారు. 54 గ్రామాల బాధ్యతను తీసుకుని అభివద్ధి చేస్తానని, అన్ని కులాలని సమానంగా చూసి, అన్ని మతాలను ఒకేలా గౌరవిస్తానని చెప్పారు. దేశం మొత్తం గర్వించేలా పిఠాపురాన్ని ఆధ్యాత్మిక రాజధానిగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ జరగని అభివద్ధిని చేసి చూపిస్తానని, పిఠాపురంలో పశువుల సంత అభివద్ధికి కృషి చేస్తానని, ఉప్పాడ జట్టీ నిర్మించడమే కాక తీరానికి రక్షణ కోసం ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఏలేరు ఆయకట్టు రైతాంగ సమస్యల పరిష్కారానికి కషి చేస్తానన్నారు. సుద్ధగడ్డ ఆధునీకరణ వెంటనే చేపడుతామన్నారు. పిఠాపురంను సీడ్ హబ్‌గా అభివద్ధి చేస్తామన్నారు. ఉద్యాన పంటల అభివద్ధికి మరింత కషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మిర్చి, పట్టు రైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ సెజ్‌లో పరిశ్రమలను తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తామని, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తామన్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగా అభివద్ధి చేయడం ద్వారా ఎంతో ఉపాధి లభిస్తుందన్నారు. టెంపుల్ హబ్‌గా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. మీ బిడ్డల భవిష్యత్తు కోసం నిలబడిన తనను గెలిపించాలని కోరారు.

పిఠాపురం సభలో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

పవన్ సభలో అపశృతి

చేబ్రోలు గ్రామంలో జరిగిన పవన్ వారాహి విజయ యాత్ర సభలో అపశృతి చోటు చేసుకుంది.పవన్ ప్రసంగిస్తుండగా జరిగిన తోపులాటలో కొందరు కింద పడ్డారు. కింద పడ్డ వారిని తొక్కడంతో ఒక బాలుడికి కాలు విరిగింది. దీంతో పాటు మరో నలుగురికి గాయాలు అయ్యాయి. వారిని వెంటనే వారిని వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.

పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) రాజ్యాంగ వ్యతిరేకమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి.. లౌకిక భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం.. అనే అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వనజ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2019లో చేసిన పౌరసత్వ సవరణ చట్టాన్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఇప్పుడు అమలు చేస్తోందని ఆమె విమర్శించారు. ఈ చట్టం దేశంలోని ప్రజలను మతాలవారీగా విడగొడుతుందని భారతదేశ లౌకిక స్వభావాన్ని నాశనం చేసి దాన్ని నిరంకుశ హిందూ మత రాజ్యాంగ మార్చడానికి ప్రయత్నమే ఈ పౌరసత్వ చట్టమన్నారు ఆర్ఎస్ఎస్ ఈ రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని ఒప్పుకోదని ఆమె గుర్తు చేశారు. దేశంలో మతసామరస్యం ఉండాలని అప్పుడే ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారని ఆమె చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ దేశాన్ని ముక్కలు చేసే ప్రమాదమున్న పౌరసత్వ చట్టాన్ని సమర్థించుకోవడానికి ప్రభుత్వం అనేక కుంటి సాకులు చెబుతోందన్నారు. 1955 చట్ట ప్రకారం ఈ దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తీ భారతీయుడేనని తేల్చి చెప్పిందని, కానీ బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం కుల ప్రాంత లింగ జాతి సాంస్కృతికపరమైన వివక్షలకు అతీతంగా భారతీయులందరికీ సమాన పౌరుషత్వ హక్కు కల్పించాలన్న రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతుందని తెలిపారు. వచ్చే నెల 6 ఇదే అంశంపై సదస్సు ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, కె.జోజి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం మరొకసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని లౌకిక ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతుందని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ సాంస్కతిక రాజధాని రాజమండ్రిలో మతతత్వ పార్టీ బిజెపి పోటీ చేయడం ఆందోళనకరమైన విషయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు, యునైటెడ్ డెమోక్రటిక్ ఫోరం కన్వీనర్ జహంగీర్, ఐడియల్ యూత్ మూమెంట్ నాయకులు కలీం మల్లా ఖాన్, ఛాన్‌బాషా, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి వి.రాజులోవ ఉపాధ్యక్షులు ఎస్ఎస్ మూర్తి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జ్యోతిరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి రాంబాబు, న్యూ డెమోక్రసీ ఎస్.కిరణ్ కుమార్, సిపిఎం సీనియర్ నాయకులు పోలిన వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, పి.మురళి, సోమేశ్వరరావు, జట్లు సంఘం ప్రధాన కార్యదర్శి సప్పరమణ, దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి సాగర్, మహిళా సమాఖ్య జిల్లా కో కన్వీనర్ ముత్యాలు, వెంకట్రావు, కాళ్ల అప్పలనాయుడు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిర్ణయాలతో ప్రజలకు కష్టాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎలాంటి ప్రణాళికలూ లేకుండా భవిష్యత్తు ఇబ్బందులను గ్రహించకుండా ఎంపీ భరత్ రామ్ అనాలోచిత నిర్ణయాలతో చేపట్టిన పనుల కారణంగా ప్రజలు, వ్యాపారులు కష్టాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక డీలక్స్ సెంటర్ నుంచి మెయిన్ రోడ్డులోని ఫ్రూట్స్ మార్కెట్ రోడ్డు వరకూ శనివారం ఆయన ఆయన ప్రచారం చేశారు. రెడ్డి మణేశ్వరరావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, తవ్వా రాజా, మజ్జి రాంబాబు, నల్లం శ్రీను, రామినీడి మస్తాన్ చౌదరి, శెట్టి జగదీష్, ఇన్నమూరి రాంబాబు, కొమ్మ శ్రీనివాస్, మాటూరి సిద్ధు పాల్గొన్నారు.

నగదు రవాణాకు ఆధారాలు ఉండాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రజలు రూ.50 వేల మించి నగదు వెంట తీసుకుని వెళ్లరాదని, అటువంటి సందర్భాల్లో తగిన ఆధారాలు వెంట ఉంచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత తెలిపారు. శనివారం కలెక్టరేట్ నుంచి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చెయ్యడంతో పాటు వివిధ నోడల్ అధికారులను నియమించి, పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఎంసిసి, సి-విజిల్, ఎన్-కోర్, ఫిర్యాదులు, సువిధ బందాలు, వివిధ న్యూస్ ఛానళ్ల, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పర్యటన నేపథ్యంలో నియోజకవర్గాల పరిధిలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వరకూ నియోజకవర్గాల స్థాయిలో పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు అత్యవసర సేవలు అందించే శాఖలకు పోస్టల్ బ్యాలెట్ జారీ కోసం తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆ మేరకు ఆయా విభాగాల నుంచి జాబితాను సిద్ధం చేసుకుని నిర్ణీత ప్రొఫార్మాలో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల నమోదు కోసం 1950 ట్రోల్ ఫ్రీ నెంబర్‌తో పాటు జిల్లా స్థాయిలో టోల్‌ఫ్రీ నెంబర్ 1800- 425 - 2540 కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీటితో పాటు సి విజిల్ యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఆయా ఫిర్యాదుల పరిష్కారం కోసం 24 గంటలూ సిబ్బందిని, పర్యవేక్షణ అధికారిని నియమించినట్లు తెలిపారు. ఎన్ కోర్ బృందాల ద్వారా ఇప్పటి వరకు 13 మంది నుంచీ రూ.23.44 లక్షలు సీజ్ చేసి, తగిన ఆధారాల మేరకు రూ.21.44 విడుదల చేసినట్టు తెలిపారు.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆర్‌టిసిలో హెవీ డ్రైవింగ్ శిక్షణ బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ శిక్షణా పాఠశాలలో శనివారం 11వ బ్యాచ్ ప్రారంభమైంది. ఈ శిక్షణ కోసం 18 మంది లైట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, హెవీ డ్రైవింగ్ శిక్షణ కోసం, డ్రైవింగ్ స్కిల్స్, నైపుణ్యత డ్రైవింగ్ గురించి తెలుసుకునే నిమిత్తం శిక్షణ పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎస్‌కె.షబ్నం శిక్షణకు సంబంధించిన మెటీరియల్ అందజేశారు. ఇప్పటి వరకు 10 బ్యాచ్‌లలో శిక్షణ పొందిన 170 మంది డ్రైవర్లు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది, సమాజంలో ఉత్తమ సుశిక్షిత డ్రైవర్లుగా గుర్తింపు తెచ్చుకుని, ఆర్‌టిసిలో, వివిధ రంగాల్లో పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఎం.అజయ్‌బాబు, పిబిఎస్.రాజు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రిటైర్డ్ హెచ్‌ఎంలకు ఘన సత్కారం

ప్రజాశక్తి-కడియం, ఉండ్రాజవరం

కడియం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తోట సత్యనారాయణ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, సంఘం పెద్దలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు మణికుమార్, నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. సత్యనారాయణ 40 ఏళ్లుగా సేవలందించారని ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మణరావు, జిల్లా అడిషనల్ సెక్రెటరీ దాసరి శివ, ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షులు సబ్బతి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పారేపల్లి నరేష్, ఆర్థిక కార్యదర్శి సబ్బతి అబ్బులు, మహిళా కన్వీనర్ వాడ్రేవు వరలక్ష్మి, వైఎస్‌టిఎఫ్ నాయకులు జయరాజ్, హెచ్‌ఎం కె.లక్ష్మణ్ కుమార్, పి.విజయ కుమారి పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో మల్లిన వెంకట నరసమ్మ జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం వారణాసి విశ్వ ప్రసాద్‌ను ఆయన ఉద్యోగ విరమణ సంద శనివారం హెచ్‌ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. విశ్వ ప్రసాద్, మాధురి దంపతులను ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, గ్రామ సర్పంచ్ మిండే వెంకటరావు, ఉపాధ్యాయులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోర్త హెచ్‌ఎం శ్రీనివాసరావు, సూర్యారావుపాలెం హెచ్‌ఎం పౌల్ ప్రకాష్, పిఆటి నిరీక్షణ రాజు, యుటిఎఫ్ నాయకులు ఐ.రాంబాబు, మండలంలోని పలు పాఠశాల ఉపాధ్యాయులు హెచ్‌ఎం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

8వ రోజుకు లారీ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి -దేవరపల్లి

మెరుగైన వేతనాల కోసం లారీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 8వ రోజుకు చేరింది. దుద్దుకూరు యూనియన్ ఆఫీస్ వద్ద సింగిల్ లారీలపై పనిచేస్తున్న కార్మికులు వేతనాల కోసం సమ్మె బాట పట్టారు. మెరుగైన వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించబోమని వారు స్పష్టం చేశారు. దుద్దుకూరులో నిరసన శిబిరం వద్ద టిడిపి గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సమ్మెలో ఎస్‌కె.మస్తాన్, ఆకాష్, పి.బాజీ, ఎస్‌కె.షఫీ, కొండయ్య, సత్యనారాయణ రాజు, రామకృష్ణ, సతీష్, ప్రసన్న, కొమ్మర రాజు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎంఎల్ఎ తలారి

ప్రజాశక్తి-తాళ్లపూడి

రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందుకు అత్యంత ప్రాధాన్యత ఉందని వైసిపి కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి, గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. తాళ్లపూడిలోని మసీదులో శనివారం ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎఎంసి మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీను, ముబారక్ భాషా తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు ధమ్మ పీఠంలో శిక్షణ

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

ఉండ్రాజవరం మైత్రేయ బుద్ధ విహార ధమ్మ పీఠంలో ఉచిత పాలీసెట్ కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు పీఠాధిపతి భంతే అనాలయో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు గ్రామ పెద్దలు మల్లిన సత్యనారాయణ, బూరుగుపల్లి కళారావు చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం టి.కృష్ణను 98668 48509లో సంప్రదించాలన్నారు.

వైద్యులకు ఘన సత్కారం

ప్రజాశక్తి- నల్లజర్ల

జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా శనివారం నల్లజర్ల ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను ఘనంగా సత్కరించారు. వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు, డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్‌లను సత్కరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాద్, జివివి.ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గంగపాలెంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కోడలు జ్యోతుల లక్ష్మీ దేవి మనుమడు అనిష్ నెహ్రూ శనివారం గంగంపాలెంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. జ్యోతుల నెహ్రూను గెలిపించాలని అభ్యర్థించారు.

సబ్ కలెక్టర్ విడిది భవనం ప్రారంభం

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

సబ్ కలెక్టరేట్ ఆవరణలో నిర్మించిన గృహాన్ని కలెక్టర్ మాధవీలత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ ఇకపై ప్రజలకి అందుబాటులో ఉండే విధంగా సబ్ కలెక్టర్ విడిది కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చినట్టు చెప్పారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్‌కు అభినందనలు తెలిపారు. జెసి ఎన్.తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అక్షరాస్యత సాధనే ఆచార్యులుకు నివాళి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సమాజంలోని ప్రజలంతా అక్షరాస్యులు అయినపుడే ఆచార్యులు ఆశయాలను సాధించిన వారమవుతామని భద్రాచలం మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. స్థానిక కోరుకొండ రోడ్డులోని యుటిఎఫ్ కార్యాలయంలో అక్షర దీక్ష ఆచార్యులుగా పేరుగాంచిన ఎంఎవిఎల్ఎన్.ఆచార్యులు 31వ వర్ధంతి సభ జనవిజ్ఞాన వేదిక, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్, ప్రజా సంఘాలు సంయుక్తంగా నిర్వహించాయి. ఆచార్యులుకు ఆయన కుటుంబ సభ్యులు, నాయకులు నివాళి అర్పించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ అక్షరాస్యత ఉద్యమం విజయవంతం చేయడంలో ఆచార్యులు పాత్రను వివరించారు. తన కుటుంబాన్ని కూడా వదులుకొని ఎప్పుడూ అక్షరాస్యత ఉద్యమమే శ్వాసగా జీవించారన్నారు. డాక్టర్ చైతన్య శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం అక్షరాస్యత ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళవలసిన అవసరం ప్రస్తుత సమాజంలో ఉన్నదని తెలిపారు. బాలోత్సవ నిర్వాహకులు తులసి మాట్లాడుతూ ఇప్పటికీ పూర్తి అక్షరాస్యతను సాధించలేకపోవడం దేశ అభివృద్ధికి మంచిది కాదన్నారు. ఎన్.రవిబాబు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం జెవివి చేస్తున్న కార్యక్రమాలు, కృషిని వివరించారు. సభాధ్యక్షులు ఎం.మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆచార్యులు ఆశయ సాధనకై అందరూ పాటుపడాలని కోరారు. జెవివి నాయకులు తాతారావు, నిశ్చల్, యుటిఎఫ్ సహాధ్యక్షురాలు ఎం.విజయగౌరి, రూపస్ రావు, శ్రీమణి, తులసి, పి.మురళి, టి.సావిత్రి, బి.పవన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు

కంటి చికిత్స యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

కొవ్వూరు లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.20 లక్షలు ఖరీదు చేసే కంటి పరిక్ష, శస్త్ర చికిత్స పరికరాలు దాతల సహకారంతో అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆప్తాలిక్ కంటి చికిత్స యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కొవ్వూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాటరాక్ట్ వంటి ఆధునిక కంటి శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తీసుకుని వస్తున్నట్టు చెప్పారు. ఆ క్రమంలో దాతల సహకారంతో రూ.20 లక్షల విలువైన పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.మనోహర్ రూ.20 లక్షల ఖరీదైన వైద్య పరికరం అందజేసి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని అభినందించారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డాక్టర్ కె.సాయి కిరణ్, డాక్టర్ శాంతి కమల పాల్గొన్నారు.



కంటి యూనిట్‌ను ప్రారంభించిన కలెక్టర్

ఆరోపణలు రుజువు చేయాలి : ఎంపీ భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పేదల సొంతింటి కల నెరవేర్చాలనే తపనతో 25 వేల కుటుంబాలకు సిఎం జగన్మోహన్ రెడ్డి మంజూరు చేసిన పట్టాలను బోగస్ పట్టాలను బోగస్ అంటున్న టిడిపి టిడిపి నాయకులు ధైర్యం ఉంటే నిరూపించాలని ఎంపీ మార్గాని భరత్ సవాల్ విసిరారు. శనివారం నగరంలోని 23వ వార్డులో ఆయన పర్యటించారు. తొలుత 40వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు తల్లి మేయర్‌గా, తండ్రి ఎంఎల్‌సిగా, సతీమణి ఎంఎల్‌ఎగా 16 ఏళ్లలో వారు ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. తనపై బురద జల్లడమే పనిగా వాసు పెట్టుకున్నాడన్నారు. ఆదిరెడ్డి కుటుంబం వల్లే రాజమండ్రి భ్రష్ట పట్టిపోయిందన్నారు. దశాబ్దన్నర కాలంగా నగరంలో ఎటువంటి అభివద్ధి జరగలేదన్నారు. ఎంపీగా నేను రాజమండ్రి నగరాన్ని తీర్చిదిద్దుతుంటే చూడలేక కడుపుమంటతో అవాకులు చెవాకులు పేలుతున్నాన్నారు. నిరాధార ఆరోపణలు చేసిన ఆదిరెడ్డి వాసుపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, రూ.10 కోట్లకు పరువు నష్టం దావా వేసినట్లు తెలిపారు. ఓట్ల కోసం ఆదిరెడ్డి కుటుంబంలా ప్రజలను నమ్మించి మోసం చేయడం తనకు చేతకాదన్నారు. 2014లో సినీ నటుడు మురళీ మోహన్ టిడిపి ఎంపీగా గెలిచిన తరువాత ప్రజల వద్దకు వచ్చిందీ లేదు, నగరానికి ఒక్క మంచి పని చేసిందీ లేదన్నారు. ఆదిరెడ్డి కుటుంబం ఏకంగా 16 సంవత్సరాలు అధికారాన్ని అనుభవించారే కానీ నగరాభివద్ధిని పూర్తిగా విస్మరించారని అన్నారు. రాజమండ్రి అభివద్ధి దిశగా పరుగులు పెడుతోందని, ఆ పరుగు మరింత వేగం కావాలంటే పార్టీ విజయం సాధించాలన్నారు. రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వాకచర్ల కృష్ణ, కొల్లేపల్లి శేషయ్య, పొలసానపల్లి హనుమంతరావు, కెఎల్ఎన్ బాబు పాల్గొన్నారు.

కూనవరంలో జనసేన ప్రచారం

ప్రజాశక్తి - సీతానగరం

కూనవరం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తోట పవన్ కుమార్, తోట ప్రత్యూష దేవి ఇంటింటికీ తిరిగి గాజు గ్లాసుకి ఓటు వేసి బత్తుల బలరామకృష్ణను గెలిపించాలని ప్రచారం చేశారు. గెడ్డం తిమ్మారావు, గద్దె సురేష్, ఒబిలినేని కృష్ణ చైతన్య, పల్లి శశికళ, కారిచర్ల విజయ్ శంకర్, మట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాపవరంలో ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పెరవలి

కాపవరంలో జనసేన పార్టీ నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. భోగవల్లి ప్రసాద్, కోటిపల్లి మురళీకృష్ణ, అతికాల శ్రీను, శేషు, పిప్పర రవి, అబ్బిశెట్టి సత్తిరాజు, కోలా సీతయ్య నాయుడు, సలాది కృష్ణమూర్తి, నందిప చక్రవర్తి పాల్గొన్నారు.

9 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి-కడియం

కడియం మండలంలో తొమ్మిది మంది వాలంటీర్లు వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్టు ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడుగురు కడియం గ్రామానికి చెందిన వారు కాగా, కడియపులంక, వేమగిరికి చెందిన ఒక్కొక్కరు ఉన్నారన్నారు.

ఉపాధి పనిలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

ఉపాధి హామీ పథకంలో పని చేస్తుండగా శనివారం గుండెపోటుతో ఒక వృద్ధురాలు మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని సగ్గొండ పంచాయితీ శివారు గోపవరంలో కార్మికురాలు సొంగ చంద్రమ్మ (62) ఉదయం పని చేస్తుండగా కింద పడిపోయింది. తోటి కూలీలు చూడగా ఆమెకు గుండె నొప్పి అధికం కావడంతో అక్కడికక్కడే కుప్ప కూలి మృతి చెందినట్టు గుర్తించారు.

నేరాలు ఘోరాలు

150 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

నాటుసారా రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 150 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ బి.తులసీధర్ తెలిపారు. ఎస్ఐ టి.కృష్ణసాయి, సిబ్బంది కుమార్, రాహుల్తో కలిసి జేగురుపాడు పాముల మెట్ట రైల్వే గేట్ దగ్గర్లో అక్రమంగా నాటు సారా రవాణా చేస్తున్న వ్యక్తిని కాపుకాచి అరెస్టు చేసినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఎర్ర గోవిందును అరెస్టు చేసి అతని వద్దనుండి 50 లీటర్ల నాటుసారా, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచే నట్లు తెలిపారు.

పేపర్ మిల్లులో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - కడియం

జేగురుపాడు గ్రామ శివారులో ఉన్న మెహర్ గాయత్రీ దేవి క్రాఫ్ట్ పేపర్స్ ఎల్ఎల్పి పేపర్ మిల్లో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. వారి మిల్ జనరల్ మేనేజర్ కంఠంరెడ్డి మలి కార్జునరావు శుక్రవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు సిఐ తులసీధర్ తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్పి ఎం.అంబికాప్రసాద్తో కలిసి శనివారం సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించినట్లు ఆయన తెలి పారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

మొక్కులు తీర్చుకోవడానికి వచ్చి..

ప్రజాశక్తి- తాళ్లపూడి

ఉపవాస ప్రార్థనలు పూర్తి చేసుకుని మొక్కు తీర్చుకోవడానికి వేగేశ్వరపురం గ్రామానికి వచ్చిన వ్యక్తి గోదావరి నదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడని ఎస్ఐ శ్యామ్సుందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా చాట్రాయి మండలానికి చెందిన బిలుగుడి పోతయ్య తన కుటుంబ సభ్యులతో శనివారం తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో గోదావరి మేరి మాత ఆలయానికి మొక్కును తీర్చుకునేందుకు వచ్చారు. తన కుమారుడు పుల్లారావు, స్నేహితులతో కలిసి గోదావరి నదిలో స్నానం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పుల్లారావు నీటిలో మునిగి పోయాడు. మృతుని తండ్రి పోతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పుల్లారావు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వా సుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆలయానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గిడ్డజాం గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగాలమ్మ ఆలయ నిర్మాణ పనులకు, అన్నదాన కార్యక్రమానికి భారత చైతన్య యువజన పార్టీ నాయకులు గొంప శివకుమార్ శనివారం రూ.10 వేలు విరాళాన్ని అందచేశారు. సంబంధిత విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు పంపనబోయిన శ్రీనుకు అందచేశారు.

టిడిపి ఆధ్వర్యంలో 'జయహో బిసి'

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన జయహో బిసి కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ 1, 2, 3ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా టిడిపి సీనియర్ నాయకుడు గుత్తుల సాయి పాల్గొని మాట్లాడుతూ టిడిపి స్థాపించిన దగ్గర నుంచి బిసిలకు పెద్దపీట వేసిందన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం బిసి కార్పొరేషన్, బిసిలకు సబ్ ప్లాన్ మరియు ఆదరణ పథకం ద్వారా పనిముట్లు గీత కార్మికులకు 50 సంవత్సరాలకు పెన్షన్ ఇచ్చిందన్నారు. బిసిలకు స్థానిక సంస్థల్లో 24 శాతం రిజర్వేషన్ కల్పించి గుర్తింపు తెచ్చిందన్నారు. నేడు వైసిపి వీటిని తొలగించి స్థానిక సంస్థల్లో 10 శాతం కోత పెట్టి 16 వేల స్థానిక పదవులు కోల్పోయేలాగా చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో గొల్లకోటి దొరబాబు, చెల్లి అశోక్, పిల్లి నాగరాజు, దంగేటి శ్రీనివాసు, యళ్ళ ఉదయ్, చిక్కాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన యుకెజి విద్యార్థులు

'ఎంపిఎస్'లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-మండపేట

స్థానిక ఎంపిఎస్లో కిండర్ గార్టెన్ విద్యను ముగించి ప్రాథమిక విద్యలో అడుగుపెడుతున్న యుకెజి విద్యార్థులందరికీ గ్రాడ్యుయేషన్డే వేడుకలు శనివారం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ వల్లూరి చిన్నారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి జీవితంలో ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. యుకెజి విద్యను ముగించుకున్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులచే గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎల్కెజి, మొదటి రెండవ తరగతి విద్యార్థుల నత్యప్రదర్శన తల్లిదండ్రులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డుపై గొయ్యిని పూడ్చాలి

ప్రజాశక్తి -మండపేట

నిత్యం రద్దీగా ఉండే స్థానిక సత్యశ్రీ రోడ్డు చింతనే జానకిరామా పిల్లల హాస్పిటల్ కు వెళ్లే వీధి సమీపంలో రోడ్డుకు గొయ్యపడింది. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే స్థానికులు తాత్కాలికంగా రాళ్ల మట్టి సంచులతో కప్పి ఉంచారు. ఈ రహదారిని ఆనుకునే రెండు ఆసుపత్రులు, ఒక ప్రభుత్వ పాఠశాల ఉంది. దీంతో విద్యార్థులు, వాహనదారులు, రోగులు నిత్యం తిరుగుతుంటారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు చెంతనే ఉన్న ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

అసంతృప్తులు...బుజ్జగింపులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలో ఎంఎల్ఎ అభ్యర్థుల ఎంపిక ఆయా పార్టీల అధిష్టానాలకు తలనొప్పిగా మారింది. టిక్కెట్లను ఆశించి భంగపడ్డ ఆశావహుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. నేటికీ అసంతృప్తివాదుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఆయా పార్టీల అధిష్టానాలు బుజ్జగింపుల చర్యలకు దిగింది. అయితే ఆశావహుల నుంచి ఏ మేరకు మద్దతు ఉంటుందో అర్థం కాని పరిస్థితిలో టిక్కెట్లు పొందిన అభ్యర్థులు ఉన్నారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధినేతలు పావులు కదుపు తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సామాజిక బలం కంటే ఆర్థిక బలమే కీలకంగా మారింది. దీం తో రెండు పార్టీల్లోనూ ఆశించి భంగపడిన వారి జాబితా చాంతాడంత పెరిగిపోతోంది. పిఠాపురం అసెంబ్లీ సీటు రాకపోవటంతో మాజీ ఎంఎల్ఎ ఎస్విఎస్ఎన్.వర్మ భగ్గుమన్న విషయం విధితమే. ఈ పార్టీ అధినేతే చర్చించి న అనంతరం స్వరం మార్చారు. పవన్ కళ్యాణ్ గెలుపుకోసం కృషి చేస్తానంటూ ప్రక టించారు. తాజాగా అనపర్తి సీటు బిజెపికి కేటాయించడంతో మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆ నియోజక వర్గంలోని టిడిపి నేతలు భగ్గుమనటం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. టిడిపి జోన్-2 కో ఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు నేతృత్వంలో మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, తదితరులు రంగంలోకి దిగారు. నల్లమిల్లిని బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ సానుకూల పరిస్థితులు లేకపోవటంతో వెను తిరిగారు. అయితే త్వరలోనే అధినేత నుంచి కబురు రానున్నట్లు తెలుస్తోంది. అటు నల్లమిల్లి ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. కొవ్వూరు నియోజకవర్గం సీటును టిడిపి ముప్పిడి వెంకటేశ్వరరావుకు కేటాయిం చడంతో మాజీ మంత్రి కెఎస్ జవహర్ మండిపడ్డారు. తాజాగా ఆ పార్టీలో జాతీయ కార్యదర్శి పదవి ఇవ్వటంతో కొంత శాంతించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా అధికార పార్టీలోనూ జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు స్థానంలో తోట నరసిం హంకు సీటు కేటాయించారు. ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్కు బదులుగా వరుపుల సుబ్బారావుకు టికెట్ కేటాయించారు. అధినేత పిలుపుతో ప్రచారా నికి హాజరవుతున్నప్పటికీ పూర్తి స్థాయి సహకారం అందేనా అనే మీమాంశ అభ్యర్థు లను వెంటాడుతోంది. ఇటువంటి ఉదాహ రణలు పిఠాపురం, పి.గన్నవరంలోనూ ఉన్నా యి. నూతన అభ్యర్థుల భవితవ్యం అసం తృప్తులు ఉన్న నియోజక వర్గాల్లో ఎలా ఉండబోతోందో వేచి చూడాల్సి ఉంది.

పిల్లర్ కుంగుబాటుతో ఉలికిపాటు

ఉభయ గోదావరి జిల్లాలను కలిపే గామన్ వంతెన 57-58 పిల్లర్ల మధ్య కుంగటంతో అధికార యంత్రాగం ఉలికి పడింది. ఉన్నతాధికారుల బృందం పర్యటించిన అనంతరం 15 రోజులలో అందుబాటులోకి తెస్తామని ప్రకటించటంతో ప్రజలకు కొంత ఊరట లభించినట్లయింది. అయితే ఆచరణలో ఏ మేరకు అందుబాటులోకి తెస్తారో వేచి చూడాలి. గామన్ వంతెన నిర్మాణం నాటి నుంచి జరిగిన వరుస పరిణామాలు నాణ్యతను ప్రశ్నిస్తున్నాయి. గతలో అప్రోచ్ రోడ్డు కుంగిపోయిన విషయం విధితమే. వంతెన నిర్మాణ సంస్థ గత కొన్నేళ్ళుగా ప్రయాణీకుల నుంచి టోల్ వసూలు చేస్తున్నప్పటికీ నిర్వహణ బాధ్యతలు సక్రమంగా చేపట్టకపోవటమే ఈ దుస్థితి కారణమని తెలుస్తోంది. మరోవైపు వంతెనకు ఇరువైపులా జరుగుతున్న ఇసుక డ్రెడ్జింగ్ కూడా ఒక కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిల్లర్లకు 500 మీటర్ల వెలుపల ఇసుక త్వకాలు చేపట్టకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవటం లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఇసుక తవ్వకాలకు కళ్లెం వేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా 35 డిగ్రీల నుంచి 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతోంది. దీంతో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు, రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు ఇబ్బందుల నడుమ దినచర్యను కొనసాగిస్తున్నారు. మార్చిలోనే ఈ విధంగా ఉంటే మే నెలలో ఎలా ఉంటాయో..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు విద్యుత్ వినియోగం పెరిగిందనే సాకుతో విద్యుత్ శాఖ అప్రకటిత విద్యుత్ కోతలకు తెర తీసింది. ఉదయం రాత్రి వేళలో విద్యుత్ కోతలు పరిపాటిగామారాయి. అంతరా యాలు లేని విద్యుత్ సరఫరా ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న ఇండో- అమెరికన్ సైనిక విన్యాశాలు

కాకినాడ సాగర తీరంలో నిర్వహించిన ఇండో - అమెరికన్ సైనిక విన్యాశాలు ఆకట్టుకున్నాయి. టైగర్ ట్రయాఫ్-24 పేరిట ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 18న విశాఖలో నిర్వహించగా కొనసాగింపుగా 27న కాకినాడలో నిర్వహించారు. సుమారు 1000 మందికిపైగా సిబ్బంది, అత్యాధునిక విమానాలతో చేపట్టిన విన్యాశాలను ఇండో- అమెరికన్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

యానాం వార్తలు

ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక భీమ్నగర్, కనకాలపేట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్ ను అక్కడి నుంచి శాశ్వతంగా తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ను ప్రజలు కోరారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగ, దుర్వాసనను భరించలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే యానాం పర్యటనకు వచ్చిన పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చౌహన్, ప్రాంతీయ పరిపాలన అధికారి మునిస్వామిలకు స్థానిక ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ను శాశ్వతంగా తొలగించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం డంపింగ్ యార్డ్కు సంబంధించి పనులు జరుగుతున్న నేపథ్యంలో వాటికి ఎలాంటి ఆటంకాలు సృష్టించకుండా ఉండాలని వారికి సూచించారు. గోపాల్ నగర్ లో డంపింగ్ యార్డ్కి సంబంధించి ఆర్ఆర్పి యూనిట్ పెట్టాలనే ఉద్దేశ్యం తనకు లేదని అన్నారు. ప్రభుత్వానికి తాను ఎటువంటి నివేదిక ఇవ్వలేదని, ప్రజలకు ఇబ్బంది లేని ప్రాంతంలో పెట్టాలని సూచించినట్లు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చౌహాన్కు సమస్యను వివరించి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించితే ప్రజల తరుపున ఉండి పోరాడుతానని స్పష్టం చేశారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు...

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఏకైక పార్లమెంట్ స్థానానికి వచ్చేనెల 19న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో శనివారం అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించింది. 26 మంది పోటీలో ఉండగా బిజెపి నుంచి ఎ.నమశివాయం, కాంగ్రెస్ నుంచి వైద్యలింగం, ఎఐఎడిఎంకె నుంచి తమిళ వేందాం, బిఎస్పి నుంచి అలంగర వేలు, నాన్ తమిళర్ కాచి పార్టీ నుంచి మేనకా, యునైటెడ్ రిపబ్లికన్ పార్టీకి ప్రభుదేవన్, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ నుంచి శంకరణ్, మరో 18 మంది స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. యానాం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా అరదాడి పోసియ్యకు గాజు గ్లాసు గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది.

మరుగున పడ్డ పారిశుధ్య వాహనాలు

- తుప్పు పడుతున్న ప్రజాధనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లాలో 2వ పెద్ద మున్సిపాలిటీ సామర్లకోట. పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ఇటీవల లక్షలాది రూపాయల ప్రజాధనంతో విలువైన వాహనాలను మున్సిపల్ అధికారులు కొనుగోలు చేశారు. పారిశుధ్య నిర్వహణకు వినియోగించిన పలు వాహనాలకు చిన్నపాటిగా వచ్చిన మరమ్మతులతో ఆ వాహనాలు మూలనపడ్డాయి. దీంతో వాటని వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో తుప్పుపట్టిపోతున్నాయి.

మున్సిపాలిటీలో 31 వార్డులు ఉండగా ఇక్కడ నానాటికి జనాభా పెరుగుతుండగా పారిశుధ్య నిర్వహణ జనాభాకు తగ్గట్టు పెరగాల్సి ఉండగా అంతకంతకు దిగజారి పోతుంది. లక్షలాది రూపాయలు వెచ్చించి సమకూర్చిన 'ఈ'ఆటోలు, ట్రాక్టర్లు, హైడ్రాలిక్ వాహనం వంటి పారిశుధ్య వాహనాలకు తుప్పు పడుతున్నాయి. మున్సిపల్ అధికా రులు వాటిని పట్టించుకోకుండా మూలన పెట్టేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న మెప్మా భవనం ఖాళీ స్థలంలో ఈ వాహనాలను నిర్లక్ష్యంగా వదిలేశారు. దానితో అవి ఎండకు ఎండి, వానకు తడు స్తూ పాడవుతున్నాయి. లక్షలాది రూపా యలు వెచ్చిం చిన పారిశుధ్య వాహనాలు నిరుపయోగంగా పడి ఉండటం పట్ల పలువురు అధికార పార్టీ కౌన్సిలర్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య ధోరణిని ప్రశ్నిస్తున్నారు. వాహనాలు తుప్పుపట్టడంతోపాటు పారిశుధ్య సిబ్బందిని సంబంధం లేని విధుల్లో ఉంచడంతో వార్డుల్లో చెత్త కుప్పలు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అంటు వ్యాధులు ప్రబ లేవిధంగా పారిశుధ్య నిర్వహణ పట్టణంలో ఉందని, ప్రజలతో పాటు అధికారపక్ష కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులను సైతం చేయిం చకుండా వాహనాలను వదిలిపెట్టడం ఎంతవరకు సమంజ సమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై సత్వరమే అధికారులు స్పందించి వాహనాలకు మరమ్మతులు చేపట్టి, పారిశుధ్య సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాయని అధికారపక్ష సభ్యులు హెచ్చరిస్తున్నారు. గతంలో సామర్లకోట మున్సిపాలిటీకి ఒక సానిటరీ సూపర్వైజర్, ఇద్దరు శానిటరీ ఇన్స్పెక్టర్ల పోస్టులు ఉండేవి. ప్రస్తుతం ఒక సానిటరీ ఇన్స్పెక్టర్ పోస్ట్ని కూడా ఇన్ఛార్జ్కి అప్పగించారు. రెగ్యులర్ శానిటరీ ఇన్స్పెక్టర్ కూడా లేరు. పట్టణ పరిధిలో వార్డు శానిటేషన్ సెక్రటరీలు ఎక్కడ పని చేస్తున్నారో కూడా ఎవరికి అర్థం కాని పరిస్థితి ఉంది. విఐపిలు నివసించే ప్రాంతాలు, మున్సిపల్ కార్యాలయం, స్టేషన్ సెంటర్ తప్ప మిగిలిన ప్రాంతాల్లో అపారిశుధ్యం తాండవిస్తుందని ప్రజలు వాపోతున్నారు. వ్యాధులు ప్రభలకముందే మున్సిపల్ అధికారులు, పాలకులు పారిశుధ్య చర్యలు మెరుగు పరచ్చేవిధంగా తగు చర్యలు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు, ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా పడి ఉన్న 'ఈ' ఆటో లు

తుప్పు పడుతున్న చెత్త సేకరణ వాహనాలు

ఘనంగా నూకాలమ్మ గరగల జాతర

ప్రజాశక్తి - అన్నవరం

మండలంలోని మండపం గ్రామంలో నూకాలమ్మ గరగల జాతర శనివారం ఘనంగా జరిగింది. స్థానిక అత్తివారు ఇలవేల్పుగా కొలివైవున్న నూకాలమ్మ గలగల రూపంలో రైల్వేస్టేషన్ రహదారికి వచ్చిన సందర్భంగా స్థానిక మహిళలు నేల బిందెలతో వచ్చే పూజారి కాళ్ళ కడికి వడపప్పును నైవేథ్యంగా సమర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భాజా భజంత్రీలు, తప్పిడి గుళ్ళు, కోలాటకాలు జాతర సంబరాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అత్తి సత్తిబాబు, స్థానిక వైసిపి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూకాలమ్మ జాతర ర్యాలీ

ఇంటింటా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కిర్లంపూడి, తాళ్లరేవు, సామర్లకోట

కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో టిడిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోసం ఆయన కుమార్తె తోట సునీత ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమం కాళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సునీత ఇంటింటికీ వెళ్లి టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి, జడ్పిటిసి సభ్యులు తోట గాంధీ, టిడిపి నాయకులు చదరం చంటిబాబు, కుర్ల చిన్నబాబు, గుడాల రాంబాబు, వీరం రెడ్డి కాశిబాబు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండలంలోని గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు టిడిపిలో చేరారు. టిడిపి ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు పాల్గొని వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకార నాయకులు నాగిడి నాగేశ్వరరావు, లంకె నూకరాజు, సంగాడి కామేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి పాల్గొన్నారు. అలాగే సామర్లకోట పట్టణంలోని 22వ వార్డులో టిడిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు నిమ్మకాయల రంగనాగ్, విత్తనాల వెంకటరమణ, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, సరోజ, బిక్కిన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమోదం లేకుండా నియామకాలా..?

-అధికారులను నిలదీసిన పాలకవర్గ సభ్యులు

ప్రజాశక్తి - పిఠాపురం

కౌన్సిల్ పాలకవర్గం ఆమోదం లేకుండా అవుట్ సోర్సింగ్లో ఉద్యోగాల భర్తీని ఎందుకు చేపట్టారని పాలకవర్గం సభ్యులు అధికార యంత్రాంగాన్ని నిలదీశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం వైస్ చైర్పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తొలిత కౌన్సిలర్లు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. దీనిలో భాగంగానే పట్టణంలో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, వేసవి కాలం ప్రారంభంలోనే ప్రజలకు తాగునీటిని అందించలేకపోతే, వేసవి తీవ్రత పెరిగితే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైవర్స్ కాలనీలోని మంచినీటి నిర్వహణ అత్యంత దారుణంగా ఉందని, పైపులైన్ల ద్వారా మురుగునీరు వస్తుందని, అయినా యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలపై అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నను పారిశుధ్యం, మంచినీటి నిర్వహణ అత్యంత దారుణంగా ఉంటుందని కౌన్సిలర్ బోనసులు కోటేశ్వరరావు అన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పుడు కొత్త పైప్ లైన్లు ఏర్పాటు చేయలేమని, కానీ ఎండా కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామని కమిషనర్ కనకరావు సమాధానం ఇచ్చారు. కౌన్సిల్ సభ్యుల ఆమోదం లేకుండా అవుట్సోర్సింగ్లో ఉద్యోగులను ఏవిధంగా నియమించారని కౌన్సిలర్ సోమరౌతు లలిత ప్రశ్నించారు. కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం లేకుండా, తీర్మానం చేయకుండా ఉద్యోగుల నియామకాలు ఎలా చేశారు? ఇందుకు ఉన్న నియమ, నిబంధనలు చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీకి సేవలు అందించి కరోనా సమయంలో మరణించిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వకుండా అధికారులు తమకు నచ్చిన వారికి ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందని, నియామకాలపై పలు అనుమానాలు ఉన్నాయని, ఉద్యోగాలు కల్పించడంలో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణలు ఉన్నాయని మరో కౌన్సిలర్ బి.దేవ ఆరోపించారు. ఈ ఉద్యోగాలు ఏ విధంగా నియమకం చేసుకున్నారనే విషయంపై పూర్తిగా కౌన్సిలర్ సమావేశంలో చర్చించాలని పట్టుబట్టారు. ఈ సమావేశంలో 24 మంది కౌన్సిల్ సభ్యులు సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని వైస్ - చైర్పర్సన్కు అందచేశారు.

వైస్ చైర్పర్సన్కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

PUBLICATION

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, AMALAPURAM
EP No.12 of 2023 In OS No: 54 of 2010
(On the file of Subordinate Jude, Yanam)

Between:
Kasi Ravibabu,
S/o.Ramachandra Rao, D.No.7-12-009, GMC Balayogi Nagar, Yanam, Pondicherry State .... D Hr

Vs

Srikakarlapudi Ramachandra Varma
S/o.Venkata Sitaramaraju, President & Correspondent, Vivekananda Public School, Panchala St., Yanam, Pondicherry State .... J Dr

The above named D Hr has instituted the above execution petition against you, and the same stands posted to **29-04-2024 at 10.30 A M** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

//by the orders of the Hon'ble court//

D.V.V.S. Murthy
Advocate, Amalapuram
98483 44577

Amalapuram
Dt.27-03-2024

సి-విజిల్ యాప్లో ఫిర్యాదులపై అవగాహన

ప్రజాశక్తి -మండపేట

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సి-విజిల్ యాప్ లో వచ్చే ఫిర్యాదులపై అవగాహన శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ, జిల్లా నోడల్ అధికారి రాంబాబు, తాసిల్దార్ సురేష్ కుమార్, మండల విస్తరణ అధికార రాజులు పాల్గొన్నారు. మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలంలకు మూడు షిఫ్టులుగా వేసిన 9 మంది సి.. విజిల్ టీం లీడర్స్, సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలువురు మాట్లాడుతూ సివిజల్ యాప్ లోకి వచ్చిన ఫిర్యాదులు వాటిని కనుగొని అక్కడికి ఏ విధంగా చేరుకుని పరిష్కరించాలో వివరించారు. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన పలు సమస్యలను వారినివత్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి రాంబాబు

ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ

మండపేట మండలంలోని ఏడిద గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై ఎంపిడిఒ ఆర్. శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన బాలబాలికలంతా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శి వీర్రాజు, వెలుగు ఉద్యోగులు పాల్గొన్నారు.

'సూర్య ప్రకాష్ విజయానికి కృషి'

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి సూర్య ప్రకాష్ విజయానికి తమ వంతు కృషి చేస్తామని ఎంఎల్సి శెట్టి బలిజ సంఘం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ అన్నారు. ఆయన శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, సూర్యప్రకాష్ను కలిసి మాట్లాడారు. మాజీ శెట్టిబలిజ గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను ఎంపీ బోస్, వైసిపి అభ్యర్థి సూర్యప్రకాష్ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ఉన్నారు. సూర్య ప్రకాష్ విజయానికి సంఘ నాయకులు కలిసి కషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.గంగవరంలో కాగడాల ప్రదర్శన

ప్రజాశక్తి-రామచంద్రపురం

పిడిఎస్యు-పివైఎల్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కె.గంగవరం లో శనివారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్ ల 93వ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన తో ఘన నివాళి అర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిఎస్యు ఉమ్మడి జిల్లా నాయకులు బి.సిద్ధు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి వి. భీమశంకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా విద్యార్థులు యువకులు భగత్ సింగ్, రాజగురు,సుఖ దేవ్ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గంగవరం మండలం లోని తహశీల్దార్ కార్యాలయం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ ఎఐకెఎంఎస్ నాయకులు అంబటి కృష్ణ, ఐఎఫ్టియు నాయకులు చింతా రాజా రెడ్డి, టిలక్ష్మణ్, గంగవరం మండల రైతు కూలీ సంఘ నాయకులు కె.పనసయ్య, రావి చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలోపాల్గొన్న పలువురు నాయకులు

వైసిపిలో పితాని బాలకృష్ణ చేరిక

ప్రజాశక్తి -ముమ్మిడివరం

జనసేన పార్టీ రాష్ట్ర పిఎసి మాజీ సభ్యుడు పితాని బాలకృష్ణ శనివారం సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ మరియు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం లో మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్న సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. అనంతరం అక్కడి నుంచి పలు వాహనాల్లో ర్యాలీగా ముమ్మిడివరం తరలివచ్చారు. వీరి వెంట ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, పెన్మత్స చిట్టి రాజు, పెయ్యల చిట్టిబాబు, ఢిల్లీ నారాయణ, కోలా బాబ్జి, తదితర నాయకులు ఉన్నారు.

సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన పితాని బాలకృష్ణ

దస్తావేజు పోయినవి

కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం, రాఘవపట్నంకు చెందిన శీరం వీరయ్య, S/o. రాములు అను నాకు ములగపూడి గ్రామ రెవిన్యూ **దస్తావేజు నెంబరు 1125/1990,** ది.01-02-2024వ తేదీన రౌతులపూడి నుండి కోటనందూరు వెళ్లుచుండగా మార్గం మధ్యలో దస్తావేజులు పోయినవి. ఈ దస్తావేజులు దొరికినవారు ఈక్రింది అడ్రసును సంప్రదించవలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాము.

శీరం వీరయ్య, S/o. రాములు
రాఘవపట్నం, రౌతులపూడి మండలం
కాకినాడ జిల్లా
సెల్: 8374226900

గ్రామపంచాయతీ కార్యాలయము, మూలస్థాన అగ్రహారం, ఆలమూరు మండలం

టెండరు నోటీసు

రి.క. నెం.06/2024 | తేది.30-03-2024

ఆలమూరు మండలం, మూలస్థాన అగ్రహారం గ్రామపంచాయతీకిగాను ఈ దిగువ తెలిపిన వివరములకు గాను ఈ దిగువ సంతకము చేయబడిన వారిచే గాని, వారిచే అధికారము ఇవ్వబడిన వారిచే గాని గ్రామపంచాయతీ కార్యాలయము నందు ది. 02-04-2024వ తేది మంగళవారం మధ్యాహ్నం 01.00 గం॥ల వరకు సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే తేదీన మధ్యాహ్నం గం॥ 3.00లకు హాజరైయున్న టెండరుదార్ల సమక్షములో టెండర్లు తెరువబడును. టెండరుదార్లు ముందుగా టెండరు ధరావత్తు చెల్లించి రశీదు టెండరునకు జతపర్చి టెండరు దాఖలు చేయవలెను. మిగిలిన విషయములు ఆఫీసు పనిచేయు వేళలో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.సం.	పని వివరము	ధరావత్తు రూ.
1	2024-25 సం॥నకు ప్రజారోగ్య పారిశుధ్య సామాన్లు సరఫరా చేయుటకు	రూ. 100.00
2	2024-25 సం॥నకు చేతిపంపు సామాన్లు విడిభాగములు, పి.డబ్ల్యు.ఎస్. స్కీమ్ సామాన్లు విడిభాగములు సరఫరా మరియు ఎలక్ట్రికల్ విడిభాగములు సరఫరా చేయుటకు	రూ. 100.00
3	01-04-2024 నుండి 31-03-2027 వరకు ప్రజారోగ్య పారిశుధ్య పనులు నిమిత్తం స్వీపరు సేవలు నిమిత్తం-5 పోస్టునకు, ట్రాక్టరు డ్రైవర్-1 పోస్టునకు	రూ. 100.00 ఒక్కొక్కరికి
4	01-04-2024 నుండి 31-03-2027 వరకు మోటరు ఆపరేటరు-1 పోస్టునకు, ఆఫీసు సబార్డినేట్ సేవలు నిమిత్తం-1 పోస్టునకు	రూ. 100.00 ఒక్కొక్కరికి

షరా: 1. సకాలంలో రాని టెండర్లు స్వీకరించబడవు. 2. గ్రామపంచాయతీ నిధుల లభ్యత మేరకు చెల్లింపులు జరుపబడును. 3. సదరు టెండర్లు వాయిదా వేయుటకు గాని, రద్దుపరచుటకు గాని గ్రామపంచాయతీకి పూర్తి అధికారము కలదు.

సం/- **లంక వరప్రసాదరావు,** సర్పంచ్
గ్రామపంచాయితీ, మూలస్థాన అగ్రహారం

సం/- **పాలంగి రాజు,** పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, మూలస్థాన అగ్రహారం